# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి పేర్కొన్నారు.
- అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను త్వరితగతిన ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.
- సంప్రదాయ వృత్తుల్లో భాగమైన చేనేత కళాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు.
- రాష్ట్రంలో నూతన పరిశ్రమలను తీసుకొస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- విశాఖపట్నం రైల్వేస్టేషన్ లో ఈరోజు కోర్బా - విశాఖ ఎక్స్ ప్రెస్‌లో అగ్నిప్రమాదం జరిగింది.

========================

గిరిజనులకు త్వరలో ట్రైకార్ రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపడతామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో “ఆదివాసీ దినోత్సవం” సందర్భంగా పలు కార్యక్రమాలను ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, గిరిజన సాంప్రదాయ బద్ధంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా అభ్యున్నతి సాధించాలన్నారు. అలాగే గిరిజన గ్రామాలకు సంవత్సరంలోగా రహదారులు నిర్మాణం చేపడతామని మంత్రి తెలియజేశారు.

========================

అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను త్వరితగతిన ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ రోజు సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తన పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. విత్తన పంపణీపై తక్షణ అమలుకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ అంటే గుర్తుకువచ్చేది చీరకట్టు, సాంప్రదాయమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మగ్గాలపై నేసిన నేత చీరలను ప్రోత్సహించే లక్ష్యంతో విశాఖ బీచ్ రోడ్ లో "ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ శారీ వాక్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ, భారతీయత చీరధారణతోనే ప్రతిభింభిస్తుందన్నారు. అనాధిగా సాంప్రదాయ వృత్తుల్లో భాగంగా వున్న చేనేత కళాకారులను ఆదరించి ప్రోత్సహించాలని, వారి వస్తువులను కొనుగోలు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆర్థిక వ్యవస్థ మూడవ స్థానానికి చేరుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విశ్వాసం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా ఈ రోజు ఆయన దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను తీసుకొస్తామని, భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో వున్న దేవాలయాలకు రక్షణ అందించడంతో పాటు, మరిన్ని ఆలయాలను పునరుద్ధరిస్తామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం రైల్వేస్టేషన్ లో ఈరోజు కోర్బా - విశాఖ ఎక్స్ ప్రెస్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. స్టేషన్‌లో 4వ నంబర్ ప్లాట్ ఫామ్ పై ఆగి ఉన్న ఈ రైలు బీ-7 ఏసి కోచ్ నుంచి మంటలు ప్రారంభమై బీ-6, ఎం-1 బోగీలకు వ్యాపించాయి. బీ-7 బోగీ పూర్తిగా దగ్ధమవ్వగా, బీ6, ఎం1 బోగీలు పాక్షికంగా ప్రభావితమయ్యాయి. అయితే ఆ సమయంలో రైలులో ప్రయాణీకులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కాగా రైలు ఈ రోజు ఉదయం 7 గంటలకు కోర్బా నుంచి విశాఖకు వచ్చిందని, మెయింటేనెన్స్ అనంతరం దానిని తిరుమల ఎక్స్‌ప్రెస్‌గా వినియోగిస్తారని అధికారులు తెలియజేశారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అఖిల భారతీయ రాష్ట్రీయ షైక్షిక్ మహాసంఘ్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఆధ్వర్యంలో "జాతీయ విద్యా విధానం"పై రెండు రోజుల సదస్సు విజయవాడ నగరంలో నిర్వహించారు. "ఉన్నత విద్యలో జాతీయ విద్యా విధానం అమలు, సవాళ్లు" అనే అంశంపై ఈ సదస్సులో పలువురు విద్యా వేత్తలు పాల్గొన్నారు. విశ్వ మంతటికీ "విశ్వ గురువుగా భారత దేశం శోభిల్లాలని" అందుకు నూతన జాతీయ విద్యా విధానం-2020ను అమలు చేయడం మంచి మార్గమని విద్యావేత్తలు ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డీన్ శివ రామ ప్రసాద్ మాట్లాడుతూ.....

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలవరం కాలువను ఏలూరు కాలువకు అనుసంధానం చేసి కృష్ణా డెల్టా ఆయకట్టు సాగుకు కృషి చేస్తామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి అన్నారు. ఈరోజ గన్నవరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి కొన్ని ప్రత్యేక నిధులు తీసుకువచ్చి, కృష్ణ కెనాల్ నుండి వస్తున్న నీటిని తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు మళ్లించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా "జల్ జీవన్ మిషన్" ద్వారా నీటి కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. అలాగే మచిలీపట్నం పోర్టు పనులను వేగవంతం చేసే విధంగా కృషి చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని బాలసౌరి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు గుంటూరు నగరంలోని మారుతీ నగర్ లో ఎన్.టీ. రామారావు విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీతి, నిజాయితీకు ఎన్టీ రామారావు నిదర్శనమని, 40 సంవత్సరాల తెలుగు దేశం పార్టీ ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని నిలిచిందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, గుంటూరు నగరంలో రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్ర ప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ....

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఈరోజు ఉదయం విఐపి విరామ సమయంలో మంత్రి దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... టిడ్కో, పీఎం ఆవాస్ యోజన గృహాలను సంవత్సరంలోగా పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకుని అన్నారు. ఈ.ఎం.ఐ. పద్ధతిలో లబ్ధిదారులకి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఆగస్టు నెలలో రెండు సార్లు గరుడవాహనసేవ నిర్వహిస్తామని ఈరోజు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 9వ తేదీన గరుడ పంచమి, 19న శ్రావణ పౌర్ణమి పర్వదినాల సందర్భంగా మలయప్పస్వామి వారు గరుడవాహనంపై నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రెండుసార్లు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని టిటిడి ఒక ప్రకటనలో వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు పట్టణానికి మరింత స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈరోజు ఆత్మకూరులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. తాగునీటి సరఫరా చేసే ప్లాంట్ ను సందర్శించి, నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే ల్యాబ్ ను మంత్రి పరిశీలించారు. ఆత్మకూరులో వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అతిథి గృహాన్ని పరిశీలించి, పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

===========================

అత్యంత ప్రసిద్ధి చెందిన దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన కనక దుర్గమ్మ ఆషాఢ మాస సంబరాలు జులై 6వ తేదీ ఆషాఢ శుద్ధ పాడ్యమిన ప్రారంభమై ఈ రోజుతో ముగిశాయి. సుమారు నెల రోజుల పాటు నిర్వహించిన ఈ మహోత్సవంలో కనకదుర్గమ్మ వారికి రాష్ట్రంలోని పలు దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, భక్తులు పవిత్ర సారెను సాంప్రదాయ బద్ధంగా సమర్పించారు.

===========================
===========================